## క్లుప్తంగా

### కృత్తివెన్ను మండలంలో 86.91 శాతం పోలింగ్

కృత్తివెన్ను: తీరప్రాంతమైన కృత్తివెన్ను మండలంలో ఎన్నికలు ముగిశాయి. పోలింగ్ శాతం 86.91 శాతంగా నమోదైంది. దీంతో ఎమ్మెల్యేగా ఎవరు గెలుస్తారు, ఎంత మెజారిటీ వస్తుందనే అంశాలపై గ్రామాల్లో విపరీతంగా చర్చ నడుస్తోంది. మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీలలో 46 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు జరిగాయి. మండలంలో మొత్తం 37,950 మంది ఓటర్లు ఉన్నారు వీరిలో 19,016 మంది పురుషులు, 18,934 మంది పురుషులు. ఈ ఎన్నికల్లో 16,610 మంది పురుషులు, 16,372 మంది మహిళలు ఓటుహక్కును వినియోగించుకున్నారు. 4,968 మంది ఓటుహక్కును వినియోగించుకోలేదు.

### సర్ ఆర్థర్ కాటన్ దొరకు ఘన నివాళి

మోపిదేవివార్పు(మోపిదేవి): ఆంధ్రప్రదేశ్‌ను అన్నపూర్ణగా, భారతదేశాన్ని ధాన్యాగారంగా తీర్చిదిద్దిన మహానీయుడు, రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్ 221వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల పరిధిలోని మోపిదేవి వార్పు వద్ద అక్విడెక్టు నిర్మాణానికి ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. నదులపై ఆనకట్టలు నిర్మించి కాలువలు తవ్వించి దక్షిణ భారతదేశ నీటిపారుదల రంగానికి కాటన్ దొర అందించిన సాగు, తాగునీటితో దివిసీమ సస్యశ్యామలం అయిందని పలువురు కొనియాడారు.

### 18న నాగాయలంకలో ఉచిత నేత్ర వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగాయలంక గ్రామంలోని మారుతీ కాన్వెంట్ ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి ఒంటిగంట వరకు ఈ శిబిరం జరుగుతుందని, మరిన్ని వివరాలకు 94906 36466, 70936 17778 నంబర్లలో సంప్రదించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. శుక్లాలు ఉన్న వారికి కంటి లోపల అద్దాలు అమర్చే ఆపరేషన్‌లు (ఐఓఎల్) శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని శేఖర్ పేర్కొన్నారు.

### 18న చల్లపల్లిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

చల్లపల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రతినిధి నర్రా సాయిబాబు తెలిపారు. స్థానిక కోమలానగర్‌లోని క్లబ్ కార్యాలయంలో దాతల సహాయంతో నిర్వహించే ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేయించి, కంటి శుక్లాలతో బాధపడే వారికి గూడూరులో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని చల్లపల్లి పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### సమ్మర్ స్టోరేజి ట్యాంక్ వినియోగంలోకి తేవాలి



చల్లపల్లి: చల్లపల్లి గ్రామంలోని నారాయణరావు నగర్, జగనన్న కాలనీ మధ్య ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వృథాగా పడి ఉంది. 25ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ తాగునీటి చెరువుకు తాగునీటిని చేర్చే మార్గం ఏర్పాటు చేసి, ఫిల్టర్ బెడ్లు, మోటార్లు సమకూర్చి ఇక్కడి నుంచి పైప్‌లైన్ల ద్వారా ఓవర్ హెడ్ ట్యాంకర్లకు నీటిని తరలించి గ్రామస్తులకు సరఫరా చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయితే చల్లపల్లిలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీరు సమృద్ధిగా లభిస్తుంది. గ్రామ పంచాయతీ అధికారులు ఇప్పటికైనా స్పందించి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఆమెదే తీర్పు- మేలి మలుపు

ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మహిళా ఓటే విజయపథాన్ని నిర్దేశించేదిగా మారింది. మచిలీపట్నం పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఐదింటిలో పురుషుల కంటే మహిళలే ఎక్కువ శాతం ఓటు వేశారు. సీఎం జగన్ నవరత్నాల పథకాలన్నింటిలో మహిళలకే అగ్రతాంబూలం ఇచ్చిన నేపథ్యంలో జగన్ రుణం తీర్చుకోవడానికే మహిళలు ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలు కట్టారని, ఇది వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పాజిటివ్ ఓటు కానుందని పలువురు విశ్లేషిస్తున్నారు.

- జిల్లాలో మొత్తం 15,39,460 మంది ఓటర్లు
- మే 13న పోలైన ఓట్లు 12,93,935
- పోలైన మహిళా ఓట్లు 6,61,859



బారులు తీరిన మహిళా ఓటర్లు (ఫైల్)

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మహిళామణుల నిర్ణయమే అభ్యర్థుల విజయావకాశాలను నిర్దేశించేదిగా కనిపిస్తోంది. జిల్లాలో మే 13వ తేదీన మొత్తం 1768 పోలింగ్ బూత్‌లలో పోలింగ్ ప్రక్రియను నిర్వహించారు. ఉదయం 6.30 గంటల నుంచే మహిళలు పెద్ద ఎత్తున పోలింగ్ బూత్‌ల వద్ద క్యూలో నిలబడి ఉండటం విశేషం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అన్ని పథకాల్లోనూ మహిళామణులకు ప్రాధాన్యం ఇవ్వటం ఆ పథకాల ఫలాలు లబ్ధి పొందిన వారు సంతోషంతో తిరిగి ఆయనే ముఖ్యమంత్రిని చేసుకోవాలనే ఉత్సాహంతో అధిక సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు మహిళలు పాల్గొన్నారని పలువురు విశ్లేషిస్తున్నారు. గత 2019 ఎన్నికల్లో వచ్చిన పోలింగ్ శాతం బట్టి చూస్తే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూడా దాదాపు అదే పోలింగ్‌శాతం నమోదు కావటం తిరిగి అదే తీర్పు వెలువడే అవకాశాలు ఉన్నాయని పలువురు రాజకీయ నాయకులు చెబుతున్నారు.

**జిల్లాలో పోలైన ఓట్లు 12,93,935**

జిల్లాలో మే 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 15,39,460 మంది ఓటర్లు ఉండగా 12,93,935 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 6,32,049 మంది పురుషులు ఉండగా, 6,61,859 మంది మహిళలు ఉన్నారు. గన్నవరం, గుడివాడ, మచిలీపట్నం, పామర్రు, పెనమలూరు నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళలు అధిక శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో పురుషులు, మహిళలు దాదాపుగా సమాన నిష్పత్తిలో ఓటు వేశారు.

**ఫలాలు అందుకున్న కృతజ్ఞతగా...**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలులో మహిళలకే అధిక ప్రాధాన్యం ఇవ్వటం, ఆ పథకాల ద్వారా వచ్చిన ఆర్థిక సాయంతో కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం అందిపుచ్చుకోవటం, వారి జీవితాలు మెరుగుపడటంతో మహిళా ప్రభంజనం ఎక్కువగా కృతజ్ఞతా భావంతో ఓటు చేసినట్టు భావిస్తున్నారు. మరోసారి జగనే ముఖ్యమంత్రి కావాలని ఎక్కువమంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారని విశ్లేషకులు అంటున్నారు. అమ్మఒడి, ఆసరా, చేయూత తదితర పథకాల ద్వారా ఎంతో మంది లబ్ధిదారులు పేదరికం నుంచి మెరుగైన జీవితం సాగించేందుకు తోడ్పాటును అందించిన సీఎం జగన్ వైపే మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మహిళల ఓటే కీలకంగా మారింది. మరి వారి తీర్పు ఎటువైపు ఉందో జూన్ 4న విడుదలయ్యే ఫలితాల్లో స్పష్టం కానుంది.

## నాగాయలంక మండలంలో 87.3 శాతం పోలింగ్

- 2019 ఎన్నికల కంటే 3 శాతం తక్కువే
- 49 పోలింగ్ కేంద్రాల్లో ఓటేసిన 34,284 మంది
- 96.5 శాతంతో చోడవరం (233వ బూత్)అగ్రస్థానం



వక్కపట్లవారిపాలెంలో వీల్‌చైర్‌లో వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్న వృద్ధురాలు

నాగాయలంక: మండలంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 49 పోలింగ్ కేంద్రాల్లో 39,232 మంది ఓటర్లకు గాను 34,284 మంది ఓటు హక్కు వినియోగించుకోగా పోలింగ్ శాతం 87.38 గా నమోదైంది. వీరిలో పురుషులు 17,396 మంది కాగా మహిళలు 16,888 మంది ఉన్నారు. గత ఎన్నికల(2019)లో పోలింగ్ శాతం 90.41 కాగా, ఈసారి మూడు శాతం ఓటింగ్ తగ్గడం గమనార్హం. దళిత వర్గాలు ప్రాతినిధ్యం వహించే చోడవరం పోలింగ్ బూత్ 233లో ఓటింగ్ 96.5 శాతం నమోదై మండలంలో అగ్రగామిగా నిలిచింది. తీరవాసులు ఉత్సాహవంతమైన ఓటింగ్‌కు నిదర్శనంగా సంగమేశ్వరం పరిధిలోని 245వ పోలింగ్ కేంద్రం(పాతఉపకాలి)లో 95.2శాతం, 244వ బూత్ (సంగమేశ్వరం) లో 93.1 శాతంతో ఈ గ్రామం ఆ తర్వాత స్థానాలలో నిలిచింది. మండల కేంద్రం నాగాయలంకలోని 224, 225 పోలింగ్ బూత్‌లలో 76.5 శాతం, 226 బూత్‌లో 78.6 శాతంతో చివరి స్థానాల్లో ఉన్నాయి. మండలంలో 90 శాతం పైగా నమోదైన గ్రామాల్లో నంగేగడ్డ, వక్కపట్లవారిపాలెం, టి.కొత్తపాలెం, రేమాలవారిపాలెం, పెదపాలెం, కమ్మనమోలు, గణపేశ్వరం, సొర్లగొంది, పర్రచివర, దీనదయాళపురం, గుల్లలమోద, ఎదురుమొండి దీవిలోని గొల్లమంద, నాచుగుంట ఉన్నాయి.

## ఓటమి భయంతో టీడీపీ దాడులు

పచ్చమూకల దాడిలో గాయపడిన నాయకులకు ఎంపీ అభ్యర్థి సింహాద్రి పరామర్శ



అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న డాక్టర్ చంద్రశేఖరరావు

మోపిదేవి: మండల పరిధిలోని మోపిదేవిలంకలో సార్వత్రిక ఎన్నికల సమయంలో పచ్చమూకల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ మండల బీసీ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు, ఆయన కుమార్తె తేజశ్రీ, జిల్లా కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు తదితరులను మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు మంగళవారం పరామర్శించారు. ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఓటమి భయంతో పచ్చమూకలు ఈ దాడులకు తెగబడుతున్నారన్నారు. అధికారం లేకుంటేనే ఇలా దాడులు చేస్తున్నారని, అధికారం వస్తే పేద వర్గాలను ఇంకెన్ని ఇబ్బందులకు గురిచేస్తారోనని ఆందోళన వెలిబుచ్చారు. అందరూ ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఆయన వెంట నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు ఉన్నారు.

## గోకర్ణేశ్వరుడి కల్యాణోత్సవాలకు వేళాయె!

- లింగారెడ్డిపాలెంలో నేటి నుంచి స్వామివారి ఉత్సవాలు
- 18న స్వామివార్ల కల్యాణం



గోకర్ణేశ్వరస్వామి

కోడూరు: దివిసీమలో అతి పురాతనమైన శైవక్షేత్రంగా పేరుగాంచిన లింగారెడ్డిపాలెంలోని బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వర స్వామి వారి ఆలయం కల్యాణోత్సవాల నేపథ్యంలో శోభాయమానంగా వెలుగొందుతోంది. గురువారం నుంచి స్వామివారి కల్యాణోత్సవాలను ప్రారంభించేందుకు దేవదాయ అధికారులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఈఓ సీహెచ్ సుధాకరరావు బుధవారం తెలిపారు. గురువారం ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహావాచనం, త్రిశూల పూజ, వాస్తు పూజ అనంతరం స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించనున్నట్లు చెప్పారు. 17న బిందెతీర్థం, మూలమూర్తికి పంచామృతాభిషేకాలు, గ్రామ బలిహరణ, రాజ్యలక్ష్మీ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, 18వ తేదీ రాత్రికి జగజ్జ్యోతి ఉత్సవం, స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. 19న కల్యాణమూర్తులకు గ్రామోత్సవం, రాత్రికి రథోత్సవం, 20న అవబృందస్నానం, పూర్ణాహుతి, శ్రీపుష్పయాగ ఉత్సవాలతో కల్యాణోత్సవాలను ముగించనున్నట్లు వివరించారు. కల్యాణోత్సవాలను పురస్కరించుకొని స్వామివారి ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

### భక్తిశ్రద్ధలతో లక్ష్మీ గణపతి హోమం



మచిలీపట్నంటౌన్: నగరంలోని గాంధీబొమ్మ శివాలయం ఆవరణలో ఉన్న అయ్యప్ప ఆలయ 33వ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా బుధవారం పలు పూజా కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ లక్ష్మీ గణపతి హోమం, శ్రీ లలితా హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించి స్వామివారికి మహాభిషేకాలు చేశారు. సువాసినీలు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీ లలితా సహస్రనామ పారాయణం చేశారు. పూజా కార్యక్రమాలకు హాజరైన సువాసినీలకు అన్నప్రసాదాన్ని అందజేశారు. మధ్యాహ్నం స్వామివారికి లక్ష మల్లెల పూజ నిర్వహించారు. సాయంత్రం భగవతి సేవలో భాగంగా సువాసినీలచే సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ భక్తబృందం పర్యవేక్షించింది.

### ఘనంగా పోతురాజు స్వామి జాతర

కోడూరు: మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామంలో పోతురాజు స్వామివారి జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి శిలలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. డప్పు వాయిద్యాల నడుమ మహిళలు స్వామివారికి నైవేద్యాలు సమర్పించి భక్తి భావం చాటుకున్నారు. యువకులు వీరతాడు, ఖడ్గాలతో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణం వద్ద రెండు వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. నక్కవానిదారి, మందపాకల, కోడూరు గ్రామాలకు చెందిన భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

- ఉద్యోగులు, సిబ్బందికి కమిషనర్ సూచన
- ఎన్నికల విధులు పూర్తికావటంతో ప్రత్యేక ఆదేశాలు



కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నంటౌన్: సార్వత్రిక ఎన్నికల విధులు ముగిసినందున నగరపాలక సంస్థ ఉద్యోగులు, సిబ్బంది ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల విధులను సక్రమంగా పూర్తి చేసినందుకు ఉద్యోగులు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. ప్రజల నుంచి పెండింగ్‌లో ఉన్న వినతులు, ఫిర్యాదులు సమస్యలను పరిష్కరించాలని సూచించారు. నగర పాలక సంస్థకు చెందిన ప్రధాన వాట్సాప్ గ్రూప్‌లో తాను ఇచ్చే ఆదేశాలకు ఎప్పటికప్పుడు స్పందిస్తూ పనిచేయాలన్నారు. ఏ విభాగానికి సంబంధించిన సమస్యలను ఆ విభాగ అధికారులు, సిబ్బంది పరిష్కరించాలన్నారు. సమస్యలను తక్షణం పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలని ఆయన సూచించారు.

## ఘనంగా పిట్టల్లంక ఆర్‌సీఎం చర్చి వందేళ్ల వేడుక

మరియమాత నూతన స్వరూపాన్ని ఆవిష్కరించిన బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు



మరియమాత స్వరూపాన్ని ఆవిష్కరిస్తున్న బిషప్ రాజారావు

పిట్టల్లంక(కోడూరు): మండల పరిధిలోని పిట్టల్లంకలో నిత్య సహాయమాత(ఆర్‌సీఎం) చర్చి వందేళ్ల వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విజయవాడ పీఠాధిపతి బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలుత పాత దేవాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన మరియమాత స్వరూపాన్ని ఆయన ఆవిష్కరించి పరలోక ప్రార్థన చేశారు. అనంతరం ఆర్‌సీఎం చర్చి ఎదురుగా జరిగిన కార్యక్రమంలో బిషప్ రాజారావు మాట్లాడుతూ మన పూర్వీకులు ఏసుక్రీస్తు పట్ల ఉంచిన విశ్వాసాన్ని ఈ తరం భక్తిశ్రద్ధలతో నడిపిస్తోందన్నారు. క్రీస్తు చూపిన బాటలో ప్రతిఒక్కరూ పయనించడం ద్వారా శాంతియుత సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం పలువురు చిన్నారులకు బిషప్ రాజారావు జ్ఞానస్థానం ఇచ్చారు. అనంతరం భక్తులకు దివ్యసత్ప్రసాదాన్ని అందించారు. తొలుత వాటర్ ట్యాంక్ నుంచి చర్చి వరకూ రహదారిపై చీరలు పరిచి, పూలు చల్లుతూ విశ్వాసులు బిషప్ రాజారావుకు ఘనస్వాగతం పలికారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కోడూరు విచారణ గురువు ప్రశాంత్ చౌటపల్లి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అవనిగడ్డ, నాగాయలంక, లక్ష్మీపురం, ఎదురుమొండి, కూచిపూడి, మచిలీపట్నం, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల నుంచి విచారణ గురువులు విచ్చేసి క్రీస్తు సందేశాన్ని అందించారు. ఉపదేశిలు, సంఘ పెద్దలతో పాటు అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల నుంచి పెద్ద ఎత్తున విశ్వాసులు పాల్గొన్నారు.

## పెనమలూరులో వారి నిర్ణయమే కీలకం

కంకిపాడు: అభ్యర్థుల గెలుపు ఓటములపై తీవ్ర స్థాయిలో చర్చ సాగుతోంది. గెలుపు ఓటములను నిర్ణయించే శక్తిగా మహిళలు, వృద్ధులు, యువత ఉన్నారు. దీంతో వారి నిర్ణయం కీలకంగా మారనుంది. వారి మద్దతు ఏ పక్షాన్ని వరించిందన్న అంశంపై ప్రధాన రాజకీయ పక్షాలు లెక్కలు కడుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల సమరంలో భాగంగా పెనమలూరు నియోజకవర్గం వ్యాప్తంగా 2,94,928 మంది ఓటర్లు ఉన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి జోగి రమేష్, టీడీపీ నుంచి బోడె ప్రసాద్‌తో పాటుగా మరో తొమ్మిది మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ నెల 13న పోలింగ్ పూర్తి కావటంతో ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రత నడుమ మచిలీపట్నం కృష్ణా విశ్వవిద్యాలయానికి తరలించారు. ఇప్పటికే ఆయా పార్టీలు గ్రామాలు, బూత్‌ల వారీగా పోలింగ్ సరళిపై సమీక్షలు మొదలుపెట్టారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మహిళలు, వృద్ధుల మద్దతు పూర్తిగా వైఎస్సార్ సీపీకే ఉంటుందని ప్రజాతంత్ర వాదులు భావిస్తున్నారు. ముస్లిం మైనార్టీలు కూటమికి మద్దతు ఇచ్చే పరిస్థితి ఉండదనే వాదన కూడా వినిపిస్తోంది. ఏది ఏమైనా ఓటరు నిర్ణయం మాత్రం ఈవీఎంలలో భద్రంగా ఉంది. జూన్ 4 వరకూ ఫలితం కోసం వేచి ఉండాల్సిందే.

## 18 నుంచి మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఆలయంలో వేంచేసియున్న భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి వారు

ఎలకుర్రు(పామర్రు): ఈ నెల 18 తేదీ నుంచి ఎలకుర్రు గ్రామంలో శ్రీ భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ప్రారంభించనున్నట్లు ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18న ధ్వజారోహణం, చిన్నాపురం వాస్తవ్యులు జన్ను నారాయణరావు సమర్పించు సిద్దు ఆదంబి సంవాదం ఉంటుందని పేర్కొన్నారు. 19న వేద పఠనం, సహస్రనామార్చన, హరికథా కాలక్షేపం, రాత్రి తొమ్మిది గంటలకు వేదాంతం రాధేశ్యామ్ బృందం వారిచే భక్త ప్రహ్లాద నాటకం ఉంటుందని తెలిపారు. ఈ నెల 20న హరికథా కాలక్షేపం, రాత్రి ఏడు గంటలకు విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ వారిచే విశ్వదాత అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలు రంగాల్లోని వ్యక్తులకు ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీన వేదపఠనం, రాత్రి ఏడు గంటలకు జగజ్యోతి, రాత్రి 9 గంటలకు భ్రమరాంబ చెన్న మల్లేశ్వర నాట్యమండలి మాచిరాజు రాధాకృష్ణ సమర్పించు సత్య హరిశ్చంద్ర నాటకం ఉంటుందని, రాత్రి రెండు గంటలకు స్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. ఈ నెల 22న 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు హరికథా కాలక్షేపాలు ఉంటాయని తెలిపారు. రాత్రి 9 గంటల నుంచి వీరభద్రస్వామి వీధిపళ్లెం కార్యక్రమం అనంతరం రాత్రి 10 గంటలకు స్వామి రథోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. 23న స్వామి త్రిశూల స్నానం, రాత్రికి ఏకాదశ ప్రదక్షిణలు, పవళింపుసేవ అనంతరం మహా అన్న సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

### 11వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నంటౌన్: నగరంలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ, మచిలీపట్నంలో 11వ తరగతి లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 15వ తేదీ నుంచి 25వ తేదీ మధ్య విద్యాలయలో దరఖాస్తులు స్వీకరించి పూర్తిచేసిన దరఖాస్తు ఫారాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు. విద్యాలయలో కేవలం ఎంపీసీ, బైపీసీలో విద్యను అభ్యసించువారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.


### 20న స్మారకోపన్యాసం

కృష్ణలంక(విజయవాడతూర్పు):స్వాతంత్ర సమరయోధుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు దేశ సమైక్యత–ఎదురవుతున్న సవాళ్లు అనే అంశంపై స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నట్లు ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ బీవీ రాఘవులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. కమ్యూనిస్టు నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### నైపుణ్యాలకు మెరుగులు

మధురానగర్(విజయవాడసెంట్రల్):దుర్గాపురం విజయ్ నర్సింగ్ కళాశాలలో అన్న సంతర్పణ సమితి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా కొనసాగుతున్నాయి. వేసవి ఎండలలో చిన్నారులు బయట తిరగకుండా వారిలోని నైపుణ్యాలను పెపొందించుకునే విధంగా పలు విభాగాల వారీగా వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఏటా ప్రముఖ రిసోర్స్ పర్సన్‌లతో అన్న సంతర్పణ సమితి ట్రస్ట్ ఉచిత వేసవి శిక్షణ ఇస్తున్నారు. యోగ, క్రాఫ్ట్ వర్క్, చిత్రలేఖనం, వెస్టర్న్ అండ్ ఫోక్ డ్యాన్స్‌లను చిన్నారులకు నేర్పిస్తున్నారు. ఆసక్తి, సృజనాత్మకతను గుర్తించి వాటిని మెరుగులు దిద్దేందుకు కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు గుండు దిలీప్ తెలిపారు. వేసవి సెలవుల్లో సమయం వృథా కాకుండా చిన్నారులకు నచ్చిన అంశాల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వటం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేసవి శిక్షణ కార్యక్రమంలో సుమారు 150 మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని వారిలోని నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకుంటున్నారు.

### వైభవంగా త్యాగరాజస్వామి జయంతి ఉత్సవాలు



గాత్ర కచేరీ నిర్వహిస్తున్న మల్లాది కార్తీక త్రివేణి

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజ స్వామి 257 జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని సంగీత విద్వాంసులు, యువ సంగీత కళాకారులు పాల్గొని త్యాగరాజ స్వామి పట్ల తమకున్న అభిమానం చాటుకున్నారు. బుధవారం నాటి సంగీతోత్సవంలో సాయి రాధాకృష్ణ గాత్ర కచేరితో ప్రారంభమయ్యాయి. తేజశ్రీ. ఓరుగంటి లక్ష్మి, పి.జయతి, మహతి, లక్ష్మీ శర్వాణి, ఆర్.పద్మశ్రీ, ఎస్.సాత్విక, చెంగల్వ రజని, గండూరి నాగేశ్వర శర్మ, యనమండ్ర శ్రీనివాస శర్మ, మల్లాది కార్తీక త్రివేణి, ధూళిపాల వాసవి త్యాగరాజ స్వామి రచించిన సంకీర్తనలు ఆలపించారు. సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, ఎన్‌సీహెచ్ బుచ్చాయ్యాచార్యులు, గాయత్రీ గౌరీనాథ్ పాల్గొన్నారు. శ్రీ సద్గురు సంగీత సభ ప్రధాన కార్యదర్శి గౌరీనాథ్, ఉపాధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, ఉపాధ్యక్షుడు బి.హరి ప్రసాద్, కోశాధికారి వీఆర్ సుబ్రహ్మణ్యం నిర్వహించారు.